యూరియా కోసం బారులు

మొక్కజొన్న సాగు రైతులు యూరియా కోసం బారులు తీరిన ఘటన ఖమ్మం జిల్లా చింతకాని మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. చింతకాని ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) పరిధిలో 17 గ్రామాల రైతులు ఉన్నారు. వీరు నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాల్వ కింద 15 వేల ఎకరాల్లో యాసంగిలో మొక్కజొన్న సాగు చేశారు. ఏపుగా వస్తున్న పంటకు యూరియా అవసరంకావడంతో సహకార పురుషులతోపాటు మహిళా రైతులు ఉదయం నుంచే యూరియా కోసం సహకార సంఘాల వద్ద బారులు తీరారు. సాగుకు సరిపోయే విధంగా యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వెంటనే పూర్తిస్థాయిలో యూరియాను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. – మధిర (చింతకాని)

'రైతుభరోసా'పై నిరసన

రైతుభరోసా కింద 15 వేలు ఇస్తామని మాట తప్పడాన్ని నిరసిస్తూ మంగళవారం కామారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు – కామారెడ్డి రూరల్

రైతు భరోసా విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారంటూ వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల శివారులో పంట పొలంలో కూలీలతో కలిసి నిరసన తెలియజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు – పెద్దమందడి

సర్వేపై తిరగబడ్డ ఎక్వాయిపల్లి

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలంలో రెండో విడత గ్రీన్‌ఫీల్డ్ సర్వేను అడ్డుకున్న రైతులు

- సాగు భూములు లాక్కుంటే తామెలా బతకాలని ఆగ్రహం
- భూమికి భూమి ఇవ్వాలని ముక్తకంఠంతో డిమాండ్
- చేసేదేమీ లేక వెనుదిరిగిన రెవెన్యూ, సర్వే అధికారులు
- పంజాగూడ నుంచి ఆకుతోటపల్లి వరకు 21కి.మీ. రోడ్డు కోసం 554 ఎకరాల భూ సేకరణకు సర్వే

సర్వేను అడ్డుకుని అధికారులతో వాగ్వివాదానికి దిగుతున్న రైతులు

రంగారెడ్డి, జనవరి 7 (నమస్తే తెలంగాణ)/ కడ్తాల్: రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన రెండో విడత గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేను మంగళవారం రైతులు అడుగడుగునా అడ్డుపడ్డారు. తమ ప్రాణాలు పోయినా సరే, సర్వేను సాగనివ్వబోమంటూ రైతులు అడ్డుకోవడంతో చేసేదేమీలేక అధికారులు వెనుదిరిగారు. కందుకూరు మండలం బేగరికంచ వద్ద నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి పంజాగూడ వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి సర్వే పూర్తిచేసింది. అప్పుడు కూడా రైతులు అడుగడుగునా అడ్డుతగలడంతో పోలీసు బందోబస్తు మధ్య సర్వే నిర్వహించారు. రెండోవిడతలో భాగంగా సుమారు 21 కిలోమీటర్ల పొడవున 330 అడుగుల వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం 554 ఎకరాల భూమి సేకరించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అందులోభాగంగా కడ్తాల్ మండలం ముద్విన్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎక్వాయిపల్లిలో సర్వే నిర్వహించేందుకు మంగళవారం అధికారులు రావడంతో వారిని స్థానికులు అడ్డుకున్నారు.

రైతుల నిరసనతో వెనుదిరిగిన అధికారులు

సర్వే నిమిత్తం ఎక్వాయిపల్లికి వచ్చిన రెవెన్యూ, సర్వే అధికారులపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ భూముల్లో సర్వే ఎలాచేస్తారని అధికారులను నిలదీశారు. తమ కున్న ఎకరం, రెండెకరాలను రోడ్డు కోసం తీసుకుంటే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. తమ భూముల నుంచి తమకు తెలియకుండా రోడ్డు వేయడంతో తాము వీధిన పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేశారు. తమ అంగీకారం లేకుండా తమ భూముల్లో 330 అడుగుల వెడల్పుతో రోడ్డు వేయడం వల్ల తమకున్న కొద్దిపాటి భూములు రోడ్డులోనే పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వ్యవసాయమే తమకు బతుకుదెరువని, ఉన్న భూములను లాక్కుంటే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. భూమికి బదులుగా భూమిస్తేనే తాము సర్వేకు సహకరిస్తామని, లేని పక్షంలో ఎట్టి పరిస్థితిలోనూ సర్వే జరుగనిచ్చేది లేదని రైతులు అడ్డుకోవడంతో అధికారులు అక్కడినుంచి వెళ్లిపోయారు.

నిద్ర పట్టడం లేదు

ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును తమ గ్రామాల నుంచి వేస్తామని ప్రకటించినప్పటి నుంచి భూములు పోతాయన్న భయంతో తమకు నిద్ర పట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమకు బతుకుదెరువు చూపిస్తున్న భూములను లాక్కొని తమను వీధిపాలు చేయడం సమంజసం కాదని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎన్నో ఏండ్లుగా తాము ఈ భూములను నమ్ముకుని జీవిస్తున్నామని, ఇప్పుడు నోటీసులు ఇవ్వకుండానే ప్రభుత్వం బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఫ్యూచర్‌సిటీ వలన తమకు లాభం ఉంటుందో, లేదో తెలియదు కాని, ఫ్యూచర్‌సిటీకి వేసే రోడ్డు వల్ల తాము రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సాగు భూములను రోడ్డు కోసం తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ భూముల నుంచి రోడ్డు వేసే ప్రతిపాదనలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

1,003 ఎకరాలు రోడ్డుపాలు

రంగారెడ్డి జిల్లాలో తొలి విడతగా కొంగరకలాన్ ఓఆర్ఆర్ నుంచి పంజాగూడ వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర 300 అడుగుల రోడ్డు నిర్మాణానికి 449ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించి సర్వే పూర్తి చేసింది. ఇప్పుడు తాజాగా పంజాగూడ నుంచి ఆకుతోటపల్లి వరకు 21 కిలోమీటర్ల మేర 330 అడుగుల రోడ్డు నిర్మాణానికి 554ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. దీంతో మొత్తంగా 1,003 ఎకరాల భూమిని రైతులు కోల్పోవాల్సి వస్తున్నది.

ఐదురోజులు అప్రమత్తంగా ఉండండి

- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న చలి తీవ్రత
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఆరెంజ్, ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతున్నది. ఉత్తరాది జిల్లాల్లో పొగమంచు విపరీతంగా కురుస్తున్నది. రాబోయే ఐదు రోజులు ఇవే పరిస్థితులు కొనసాగుతాయని ఐఎండీ పేర్కొన్నది. జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల వరకు, హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో 7-9 డిగ్రీల వరకు తగ్గే అవకాశం ఉన్నట్టు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో కనిష్ఠంగా 9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణీలో 9.6, మిగతా జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్టు వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో సంగారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు ఆరెంజ్, మిగితా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశామని అధికారులు తెలిపారు. ఇక, హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో 11.6 నుంచి 15 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, చలితీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మాఫీ పూర్తికాలే.. ప్రజల్లోకి వెళ్లలేం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 7: ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లోని 33 శాతం మంది రైతులకు మాత్రమే రూ.2 లక్షల లోపు రుణమాఫీ జరిగిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్‌లోని డిచ్‌పల్లిలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లాలంటే కచ్చితంగా రుణమాఫీ జరిగి తీరాలని స్పష్టం చేశారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి సమావేశానికి వచ్చిన వారు సంతకాలు చేయలని సూచించగా రిజిస్టర్‌లో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పేరు రిజిస్టర్‌లో ఉండి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు లేకపోవడంతో ఆయన అనుచరులు ఆందోళనకు దిగారు. జీవన్‌రెడ్డి, సంజయ్ అనుచరుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సమావేశం రసాభాసాగా మారింది.

రోడ్డెక్కిన చిన్నకాళేశ్వరం రైతు

- మెయిన్ కెనాల్ కోసం స్థల సేకరణ
- పరిహారం కోసం రైతుల ఆందోళన
- మహిళా రైతు ఆత్మహత్యాయత్నం
- మరో రైతుపై పోలీసుల ప్రతాపం
- పరిహారమిస్తేనే భూమి ఇస్తామంటున్న రైతులు

దళిత రైతు ప్రసాద్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 7 (నమస్తే తెలంగాణ): చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు సమస్య మళ్లీ మొదటికొచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ప్రారంభించి 70 శాతం పనులను ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తిచేసింది. చెరువుల మరమ్మతు, మెయిన్ కెనాల్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను నిర్మించాల్సి ఉండగా స్థల సేకరణ సమస్యగా మారింది. వారం రోజులుగా మెయిన్ కెనాల్ నిర్మాణం కోసం అధికారులు స్థల సేకరణ చేపడుతుండగా రైతులు అడ్డుకుంటున్నారు. తమకు పరిహారం ఇచ్చాకే సర్వే చేయాలని, పనులు ప్రారంభించాలని పట్టుబట్టారు. ఈ విషయమై తహసీల్దార్‌తోపాటు కలెక్టర్‌కు, మంత్రి శ్రీధర్‌బాబును కలిసి తమ గోడువెళ్లబోసుకున్నారు. అయినా ఫలితం లేకుండాపోయింది. మంగళవారం మళ్లీ అధికారులు మెయిన్ కెనాల్ పనులు ప్రారంభించేందుకు వెళ్లగా మహాదేవపూర్‌లో రైతులు అడ్డుకున్నారు. రాళ్లబండి రజిత అనే మహిళా రైతు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నిస్తుండగా పోలీసులు అడ్డుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అలాగే మరో రైతు ఆల్ల ప్రసాద్ ఇదేంటని ప్రశ్నించగా అతడిపై పోలీసులు తమ ప్రతాపం చూపించి అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో మహాదేవపూర్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిహారం ఇచ్చే వరకు భూములు ఇచ్చేది లేదని రైతులు భీష్మించుకుని కూర్చున్నారు.

20 మంది రైతుల సమస్య

చిన్నకాళేశ్వరం ప్రాజెక్టు మెయిన్ కెనాల్ నిర్మాణంతో ఆరు గ్రామాలకు చెందిన 20 మంది రైతులు 10 ఎకరాలను కోల్పోతున్నారు. ఏళ్లతరబడి సాగు చేసుకుని బతుకుతున్నామని, తమకు పరిహారం ఇవ్వకుండా ఎలా లాక్కుంటారని రైతులు మండిపడుతున్నారు. అధికారులకు, మంత్రికి విన్నవించకున్నా ఫలితం లేదని, బలవంతంగా లాక్కుంటే చావే దిక్కని స్పష్టం చేస్తున్నారు. అధికారులు మాత్రం అది సర్కారు భూమి అని, పరిహారం ఇవ్వడం కుదరదని స్పష్టం చేస్తున్నారు.

చిన్న కాళేశ్వరంపై చిన్నచూపు

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చిన్న కాళేశ్వరం పనులను 3 నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించి ఇప్పటికీ పైసా పనిచేయలేదని రైతులు మండి పడుతున్నారు. చెరువుల అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారగా కాలువల సర్వే పనులు సైతం ఇష్టారాజ్యంగా చేస్తూ తీవ్ర నష్టం కలిగిస్తున్నారని రైతులు పనులను అడ్డుకుంటున్నారు. చిన్న కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించింది. 14 చెరువులు నింపి 45,742 ఎకరాలకు సాగు నీరందించే ఈ చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం 70 శాతం పూర్తి చేసింది. పలు అనుమతుల్లో జాప్యం జరగడంతో మిగిలిన 30 శాతం పనులు పెండింగ్‌లో ఉండి పోయాయి.

మా భూములను గుంజుకుంటున్నరు

మా మామ పోచం పేరు మీద అరెకరం భూమి ఉన్నది. ప్రాజెక్ట్ కోసం అధికారులు అన్యాయంగా మా భూమి తీసుకుంటాళ్లు. ఇంతవరకు నష్టపరిహారం ఇయ్యలే. ఈ రందితోనే మామకు పక్షవాతం అచ్చింది. మంచం పైనుంచి లేత్తలేడు. న్యాయం చేయాలని అడిగినందుకు పోలీసులు నా భర్త ప్రసాద్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేన్‌కు పట్టుకపోయింర్రు. భూమినే నమ్ముకొని బతికేటోళ్లం. గింత దారుణంగా భూముల్ని లాక్కొంటే మేము ఎవరికి చెప్పుకోవాలే. నేను 9 నెలల గర్భిణిని. నా భర్తను అరెస్ట్ చేయద్దని పోలీసోళ్ల కాళ్ల మీద పడ్డా ఇడిసిపెట్టలే.

– ఆళ్ల స్వాతి, ఎల్కేశ్వరం, మహదేవపూర్ మండలం, భూపాలపల్లి జిల్లా

ఢిల్లీలో రైతుభరోసా పోస్టర్ల కలకలం

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ): రైతు భరోసాపై కాంగ్రెస్ యూటర్న్ తీసుకోవటాన్ని నిరసిస్తూ ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం వద్ద పోస్టర్లు వెలిశాయి. వరంగల్ డిక్లరేషన్ పేరిట ఎకరాకు రూ.15 వేలు చింది.. అని 'కాంగ్రెస్ రైతు భరోసా యూటర్న్' పేరిట మంగళవారం ఏఐసీసీ కార్యాలయ ప్రాంగణంలో వెలసిన పోస్టర్లు కలకలం రేపాయి. ఈ విషయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ రైతు రైతుభరోసా ఇస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. కానీ, 2024లో ఒక్క రూపాయి విడుదల చేయలేదు.. కనీసం ఈ సంవత్సరమైనా రైతుభరోసా వస్తుందని ఆశించిన రైతాంగానికి రేవంత్ సర్కార్ కోత విధించి నిరసన సెగ ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయాన్ని తాకిందని ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. వరంగల్ డిక్లరేషన్ పేరున రాహుల్ గాంధీ ఇచ్చిన హామీకి విలువ లేని దుస్థితి నెలకొన్నదని విమర్శించారు.

అటకెక్కిన బేబీకేర్ సెంటర్ల ఏర్పాటు!

- రాష్ట్రంలో 33 సెంటర్ల ఏర్పాటుకు కేంద్రం అనుమతి
- కేంద్రాల ఏర్పాటుపై కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం

హైదరాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా వర్కింగ్ ఉమెన్స్ పిల్లల సంరక్షణకు బేబీకేర్ సెంటర్లు ఏర్పాటుచేయాల్సి ఉన్నది. ముఖ్యంగా కుటుంబ పోషణ కోసం పనికి వెళ్లేవారి పిల్లల సంరక్షణకు వీటిని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అందుకు సంబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా తెలంగాణలో మొత్తం 33 శిశు సంరక్షణ సెంటర్ల ఏర్పాటు కోసం నిధులూ విడుదల చేసింది. ప్రస్తుతం ఈ నిధులు ఆర్థికశాఖ వద్దే ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. సెంటర్ల ఏర్పాటుపై కేంద్రం ఆదేశాలు ఇచ్చి ఏడాది దాటినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వాటి ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తున్నదనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా ఈ సెంటర్లలో ముందుగానే టీచర్లు, ఆయాల నియామకం జరగాల్సి ఉంది. కానీ, వారికిచ్చే వేతనాలు తక్కువగా ఉండడంతో ఎవరూ ముందుకురాని పరిస్థితి. సంబంధిత అధికారులు మాత్రం నెలరోజుల్లో వీటిని ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయని చెప్తున్నారు. ఇన్ని సమస్యల మధ్య ఈ పథకం ముందుకెళ్తుందా? లేక అటకెక్కిస్తారా? అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్కింగ్ ఉమెన్స్ మాత్రం ఇప్పటికైనా ఈ సెంటర్లను ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

సిరిసిల్లజిల్లా వీర్నపల్లి మండలం వన్‌పల్లి పరిధిలోని కేలోత్‌తండాలోని ఎంపీపీఎస్‌లో తరగతి గదిలోనే గ్యాస్‌స్టౌవ్, సిలిండర్, సామగ్రి

బోధన గదిలోనే వంట

వీర్నపల్లి, జనవరి 7: సర్కారు బడుల్లో వసతులు కొరవడి పిల్లలకు పాఠాలు చెప్పే గదిలోనే వంట చేస్తున్నారు. ఇందుకు నిదర్శనమే రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం వన్‌పల్లి పరిధి కేలోత్‌తండాలోని మండలపరిషత్ పాఠశాల. ఇందులో 23 మంది విద్యార్థులు, 12 మంది అంగన్‌వాడీ చిన్నారులు ఉన్నారు. ఉన్న ఒక్క గదిలో పాఠశాల విద్యార్థులకు, ఆరు బయట అంగన్‌వాడీ చిన్నారులకు బోధన అందిస్తున్నారు. బడి ఆవరణలో కిచెన్ షెడ్డు ఉండగా, ఈదురుగాలులకు పైకప్పు లేచిపోయింది. అప్పటి నుంచి నిర్వాహకులు తరగతి గదిలోనే వంట చేస్తున్నారు. అధికారులు స్పందించి కిచెన్ షెడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

31 మందికి ఫుడ్‌పాయిజన్

మొదటిపేజీ తరువాయి...

పది గంటల వరకు విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా, వెంటవెంటనే చికిత్స అందించడంతో పెను ప్రమాదం తప్పిందని వైద్యులు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు 23 మందిని, మిగతా 8 మంది సాయంత్రం డిశ్చార్జి చేశారు. అదనపు కలెక్టర్, ఆర్డీవో, ఇతర అధికారులు బాధిత విద్యార్థులను పరామర్శించారు. ఆహార పదార్థాల శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. ఇది ఫుడ్‌పాయిజ్ కాదని, అరగకపోవడం వల్ల అస్వస్థతకు గురైనట్టు అధికారులు పేర్కొన్నారు. ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్వీతోపాటు ఇతర విద్యార్థి సంఘాలు, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు గురుకులానికి చేరుకుని ఆందోళనకు దిగాయి. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని, బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలంటూ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హాస్టల్‌కు వచ్చిన అదనపు కలెక్టర్ స్పష్టం చేసినా వారు వెనక్కి తగ్గలేదు. పోలీసులు చొరవ తీసుకొని బీసీ గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి అంజలితో వివరణ ఇప్పించగా ఆందోళన విరమించారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపించి, బాధ్యులైన అధికారులు, సిబ్బంది, గుత్తేదారుపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పొన్నం అనిల్‌కుమార్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఎంజీయూలో గొడ్డుకారంతో బ్రేక్‌ఫాస్ట్?

- సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్
- మేమే అడిగామంటూ విద్యార్థినులతో వివరణ ఇప్పించిన అధికారులు

ఎంజీయూలోని కృష్ణవేణి హాస్టల్‌లో విద్యార్థినులకు పెట్టిన అన్నం, కారం

నల్లగొండ, జనవరి 7 : నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థినులకు గొడ్డుకారం అన్నం బ్రేక్‌ఫాస్ట్‌గా అందించారు. వర్సిటీలోని కృష్ణవేణి బాలికల వసతి గృహంలో మంగళవారం విద్యార్థినులకు బ్రేక్ ఫాస్ట్‌గా అన్నంతోపాటు గొడ్డుకారం పెట్టారు. విద్యార్థులు ప్లేట్లతో క్యూలో ఉండగా అన్నం, కారం బేసిన్, ఉప్పు డబ్బా పక్కనే ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఎంజీయూలో కారం అన్నమే బ్రేస్ట్‌ఫాస్ట్ అంటూ చక్కర్లు కొట్టాయి. కాగా, సాయంత్రానికి అదే విద్యార్థినులతో బ్రేక్‌ఫాస్ట్‌లో బోండా పెట్టారని, తామే కారం అన్నం అడిగామని లెటర్ విడుదల చేయించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు మాలధారణలో ఉన్నారని, చలి కాలం కావడంతో కూర ఉన్నప్పటికీ కారం అడగడం వల్లే ఇచ్చామని హాస్టల్ సిబ్బంది వివరణతో మరో లెటర్ బయటకు వచ్చింది. ఆ తర్వాత హాస్టల్ డైరెక్టర్లు దోమల రమేశ్, కళ్యాణి కలిసి వార్డెన్లు రాజేశ్వరి, జ్యోతితో ప్రత్యక్ష పరిశీలన చేయించామని చెప్తూ మరోసారి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. బ్రేక్‌ఫాస్ట్‌లో గొడ్డుకారం పెట్టడంపై స్పష్టత రాలేదు.